

# 'అదే' కథలు

## – ఆర్.శర్మ దంతుర్తి

ముందు మాట – అమెరికా వచ్చిన భారతీయుల్ని 'దేశీ'లంటారని, వారి దైనందిన జీవితాల్లో జరిగే అనేకానేక విషయాలతో అమెరికా దేశీయ కథలు అనే పేరుతో ఈ వరస కథలు మొదలుపెట్టాను, గౌరవం కోసం 'య' అనేది చేర్చి. ఇందులో చర్చించిన సమస్యలు పూర్తిగా కాకపోయినా చాలా మటుక్కు అన్నీ స్వకపోల కల్పనలు – ఇలా జరిగి ఉండొచ్చని ఊహించి రాసినవి. కొన్ని ఇలా జరిగినట్టు ఇంటర్నెట్ మీదా, వార్తల్లోనూ చదివినవి. అవి మీకు కానీ మీకు తెల్సున్నవాళ్ళకి కానీ జరిగితే అది పూర్తిగా కాకతాళీయం/యాదృచ్ఛికం మాత్రమే. సరదాకి రాసిన ఈ కథలు వినోదంగా చదువుకోవడానికి మాత్రమే. చాలామటుకు నవ్వు వచ్చినా కొన్ని కథల్లో ఏడుపుకూడా రావొచ్చు. ఆ నవ్వులకి, బాధలకి, దుఃఖాలకి నా బాధ్యత లేదు.

## 59

## కూరిమికల దినములలో

**కొత్తగా వచ్చిన హరీష్** ఊర్లో గుడికి వెళ్ళాడు భారా పిల్లల్తోటి. అక్కడే మొదటి పరిచయం శ్రీపతితో. శ్రీపతి ఆ ఊరివాడే కొన్నేళ్ల బట్టీ ఉంటున్నారుట. "ఓ సారి వీలు చూసుకుని మా ఇంటికి రండి" అన్నారు. ఫోన్ నెంబర్ తీసుకున్నారు వీలున్నప్పుడు ఫోన్ చేస్తారుట.

మరో మూడు నెలలకి ఫోన్ వచ్చింది – "ఇప్పటివరకూ ఫోన్ చేయలేదు ఏమీ అనుకోకండి; మీరిచ్చిన ఫోను నెంబర్ కాయితం ఎక్కడో పెట్టి మర్చిపోయాం".

ఇటువంటివి సర్వ సాధారణ అబద్ధాలు కనక సరే అంటే సరే అనుకుని ఆ పై శనివారం మూడింటికి వెళ్ళారు శ్రీపతి ఇంటికి. పిల్చింది భోయనానికి కాదు కనక కొన్ని బిస్కట్లూ, టీ ఇవ్వబడ్డాయి. ఎక్కడ పనిచేస్తున్నారు, పుస్తకాలు, సినిమాలు, నమోగారి పాలన, తెలంగాణాలో జరిగే తతంగాలూ, ఆంధ్రాలో జరిగే విషయాలూ మాట్లాడుకుని మరోసారి కలుద్దాం అని విడిపోయేరు. అలా స్నేహం కొంచెం కొంచెంగా వృద్ధీ క్షయం కానట్టూ ఉంది.

పెరుగుట విరుగుట కొరకే అని మనకి తెల్సిందే కాబట్టి దెబ్బలాటలు వస్తాయేమో అనే అనుమానం అనవసరం. వచ్చి తీరుతాయి. దీనికి రెండు కారణాలు. మొదటి విషయం ప్రకారం హరీష్ కి రెండు కార్లు ఉన్నాయి. ఒకటి తాను

రోజూ ఆఫీసుకి తీసుకెళ్ళేది. రెండోది ఒక వేన్ కుటుంబం అంతా విహారానికీ, గుడికీ వెళ్తే తీసుకెళ్ళేది. కారు ఇష్టం వచ్చినట్టూ తిప్పినా వేన్ మాత్రం పొదుపుగా వాడుతూ ఉంటారు. శ్రీపతికి ఉన్నది ఒకటే కారు. శ్రీపతి అత్తా మామా అమెరికా చూడ్డానికి వస్తున్నారుట. వాళ్ళొచ్చాక హరీష్ వేన్ ఇస్తే మూడు రోజులు అటూ ఇటూ తిరిగి తీసుకొచ్చి ఇచ్చేస్తారు. ఇలా అడగడంలో కొన్ని విషయాలు మర్చిపోయేడు శ్రీపతి. ఎదుటివారి కారు ఎన్నడూ ఎటువంటి పరిస్థితులలోనూ అడగరాదు, నడపరాదు; ఎందుకంటే ఏక్సిడెంట్ అయితే ఇన్స్యూరెన్స్ డబ్బులు ఇవ్వరు బండి నడిపేది ఓనర్ కాకపోతే. కష్టపడి పేచీ పెట్టినా ఇన్స్యూరెన్స్ ఉన్నది బిజినెస్ చేసుకోవడానిక్కనక నానా యాగీ పెట్టి ముక్కు మూయించి, మూడు చెరువుల నీళ్ళు తాగించి ఇస్తే ఇస్తారేమో. రెండో విషయం శ్రీపతి అంతకు ముందెన్నడూ వేన్ నడపలేదు. మూడోది వేన్ ఓనరు హరీశ్ కూడా రాడు; లేదా రానవసరం లేదు. శ్రీపతి ఇలా అడుగుతాడనీ అడగగలడనీ కూడా హరీశ్ ఊహించలేదు. అందువల్ల సమాధానం చెప్పాలంటే కాస్త సంకోచం. ఇవ్వనంటే కోపం రావొచ్చు కదా? అందువల్ల చెప్పేడు, "మీవాళ్ళు వచ్చినప్పుడు ఎక్కడికైనా వెళ్దాం అనుకుంటే చెప్పండి, మేమూ వస్తాం అందరం కలిసి వేన్ ప్లస్ మరో కారూ తీసుకుని వెళ్ళొచ్చు."

మొహం గంటు పెట్టుకుని వెళ్ళిపోయేడు శ్రీపతి . ఉత్తరోత్తరా హరీష్ వాళ్ళావిడ చెప్పిన ప్రకారం శ్రీపతి కి కోపం వచ్చిందిట వేన్ ఇవ్వనందుకు. హరీష్ వాళ్ళావిడకి ఎలా తెల్సిందంటారా? మొగుడ్స్ అన్నీ పైకి చెప్పుకోరు కానీ పెళ్ళామ్స్ అందరూ ఫోనుమీద అన్నీ మాట్లాడుకోరూ? తిక్కరేగిన హరీష్ చెప్పేడు, "నేను చెప్పానని వాళ్ళావిడకి చెప్పు ఈసారి ఫోన్ చేస్తే. బుద్ధి అనేది ఉంటే అలా వేరేవాళ్ల బండి ఎప్పుడూ అడక్కూడదని తెలియదా? అమెరికా వచ్చిన మొదటిరోజే నేర్చుకోవాల్సిన విషయం అది." అలా స్నేహం వికటించడం మొదలైంది.

తర్వాత మూడు నెలలకి మరో సమస్య మొదలైంది. ఈసారి శ్రీపతి తన ఇంట్లో ఏదో సామాను యార్డ్ సేల్ లో అమ్ముతున్నాడు. రమ్మని అడిగితే హరీష్ సహాయం చేయడానికి వెళ్ళాడు. ఇంట్లో ఇన్న పరుపు కూడా అమ్ముతున్నార్ట. కొన్నది కొత్తదే, రెండో బెడ్రూంలో వాడడానికి పెట్టారు కానీ వాడినది మహా అయితే రెండు సార్లు. ఇంకా కొత్త వాసన వేస్తోంది కూడా. చూడ్డానికి వచ్చిన వాళ్ళలో ఒకాయన మూడు వందలు ఇస్తానన్నాడు. శ్రీపతి కి నాలుగువందలు కావాల్ట. కొన్నది నాలుగూ యాభై కనకా అసలు వాడినది తక్కువ కనకా. క్రైగ్స్ లిస్ట్ అనే చోట కూడా పెట్టాడుట అమ్మకం సంగతి. అక్కడ ఒకాయన నాలుగు వందలు ఇస్తానన్నాట్ట కానీ తాను రాలేదు, చెక్కు పంపిస్తాడు; అది కేష్ అయ్యాక వచ్చి తీసుకెళ్తాడు.

క్రైగ్స్ లిస్టు లో చెక్కులు అంత నమ్మదగ్గవి కాదు అని హరీష్ కి తెలిసినా ఈ విషయంలో మాట్లాడలేదు. పరుపు అమ్మేది శ్రీపతి, తాను పట్టించుకోవడం దేనికి? ఏమైనా అంటే ఆయనకి ఎక్కువ డబ్బులు వస్తున్నాయని తాను ఏడుస్తున్నాని అనుకోడూ? హరీష్ వెనక్కి వచ్చేసాడు ఆ రోజుకి చేయాల్సిన సహాయం అయిపోయాక.

తర్వాత మరోసారి ఫోన్ కాల్ వల్ల, అమ్మగారి వల్లా తెల్సిన విషయం ఇదీ – పరుపు క్రైగ్స్ లిస్టులో డీల్ కి అమ్మారు కానీ మోసం జరిగింది. దీనికంతటికీ కారణం హరీష్ ట. ఎందుకంటే క్రైగ్స్ లిస్టులో నాలుగువందలు వద్దు అని చెప్పలేదుట. దాని వల్ల వంద డాలర్ల పైన నష్టం వచ్చింది. జరిగిన కథ ఇంకోటి.

క్రైగ్స్ లిస్టు లో పరుపు కొంటామని చెప్పిన వారు ముందు ఐదువందలకి చెక్కు పంపారుట. ఎందుకంటే కొనే వారిది ఏదో కంపెనీ బిజినెస్సు. ఐదు వందలకంటే తక్కువ పంపడం కంపెనీ పాలసీకి విరుద్ధం. అది పోస్టులో పంపాక శ్రీపతి అందినట్టూ ఫోన్ చేస్తే పరుపు తీసుకెళ్ళడానికి ఎవర్నో పంపుతారు. చెక్కుదేవుంది, శ్రీపతికి ఇష్టం వచ్చినప్పుడూ కేష్ చేసుకోవచ్చు. పరుపు అమ్మేది నాలుగువందలకి కనకా, ముందే ఐదు వందలకి చెక్కు ఇచ్చేస్తారు కనకా పరుపు తీసుకోపోవడానికి మర్నాడు వచ్చే వాళ్ళకి మిగిలిన వంద డాలర్లూ కేష్ ఇచ్చేయగలరా? సరే అన్నాడు శ్రీపతి. శ్రీపతి కి ఐదు వందల చెక్కు చేతిలోకి వచ్చినది శుక్రవారం మధ్యాహ్నం. చెక్కురూపంలో లక్ష్మీదేవి శుక్రవారం రావడం మంచి శకునం కదా? చెక్కు వెంఠనే డిపాజిట్ చేశాడు బేంకులో. తర్వాత చెక్కు పంపినవారికి ఫోన్ చేసి చెప్పాడు వచ్చి పరుపు తీసుకెళ్ళమని. మర్నాడు శనివారం ఎవరో వచ్చి ఈయన ఇచ్చిన వంద డాలర్ల కేషూ, పరుపూ తీసుకెళ్ళారు. ఆ పై వారంలో శ్రీపతి కి బేంక్ వారు చావు కబురు చల్లగా చెప్పారు – అయ్యా మీరు డిపాజిట్ చేసిన అయిదు వందల చెక్కు బౌన్స్ అయిందండి. అందువల్ల మీరు మరో డబ్బై డాలర్లు ఫైన్ కట్టండి.

ఆ తర్వాత తెలిసింది అసలు మోసం. శ్రీపతి ఇచ్చిన వంద డాలర్ల కేష్, బేంక్ కట్టమన్న డబ్బై ఆయన జేబులోంచే పడ్డాయి. పరుపు ఎవరో వచ్చి తీసుకెళ్ళారు. అదీ పోయింది. అయిదు వందల చెక్కు బౌన్స్ అయింది కనక దానికీ నీళ్ళ ధారే. పరుపుకీ, నూటడబ్బై డాలర్లకి శ్రీపతి తూర్పు తిరిగి దణ్ణం పెట్టాడు. ఇది క్రైగ్స్ లిస్టులో సర్వసాధారణంగా జరిగే మోసం. అది తెలియక హరీష్ తో మాట్లాడ్డం మానేసాడు శ్రీపతి మర్నాటి నుంచీ.

అప్పట్నుంచీ తమ స్నేహం చెడిపోవడానిక్కారణం హరీష్ మాత్రమే అని చెప్తాడు అందరితో కూడా; తాను గీత దాటాడనీ, కూరిమి విరసం అవడానికి తానే దోహదం చేసాడనీ, ఇలా తప్పులు వెదకడంతో ఇద్దరికీ పూర్తిగా చెడింది. అయితే హరీష్ ఏమీ మాట్లాడలేదు. ఏద్దైనా అంటే ఇటువైపు అమ్మగారు ఫోన్ లో అవతల వైపు అమ్మగారికి చెప్పేయరూ? మొగుళ్ళు అయితే పనీ పాటా లేక ఇలా మాటా మాటా అనుకుని కొట్టుకుంటూ మాట్లాడుకోవడం మానేస్తారు కానీ భార్యలందరూ స్నేహితులు కాదుటండీ? అయినా మౌనం బంగారం కదా? స్నేహం లేనినాడు ఎప్పుడూ తప్పులే ఎందుకు కనిపిస్తాయో మన బద్దెన ఏనాడో చెప్పలే?

నీతిః కూరిమి గల దినములలో
నేరము లెన్నడును గలుగ నేరవు మఱి యా
కూరిమి విరసం బైనను
నేరములే తోచుచుండు నిక్కము సుమతీ!

Post your comments